**లోకం తీరు :**

# స మ్మె స న్నా హం

ఓ గే టి శి వ రా మ కృ ష్ణ

విశ్వాసపురంలోని పాఠశాల విద్యార్థులు హఠాత్తుగా ఒకనాటి ఉదయం సమావేశమయ్యారు. సమావేశానికి కారణం—నిజంగా చెప్పవలసివస్తే—మనకేం తెలియదు. వాళ్లల్లో వాళ్ళు గుద్దులాడుకొంటున్నారు, ఎవళ్లనో నోటికి వచ్చినట్టుగా తిట్టిపోస్తున్నారు.

అయితే నోటికివచ్చినట్లుగా తిట్టడం యిష్టం లేని కొద్దివిద్యార్థులు మాత్రం—'అహింసా మార్గంలో—విజయం సాధించాలిగాని—దెబ్బకు దెబ్బకొట్టడం మంచిది కాదంటున్నారు. వారు గాంధీగారి సిద్ధాంతాల అడుగుజాడల్లో తూచా తప్పక నడుస్తున్నట్లుగా.

'దెబ్బకు దెబ్బ...లేకపోతే ..ఆ చవట...బడికి పెద్దయిన మన సోదరుడ్ని కొడతాడా ? కొట్టటం కాదు—మెడమీద చేయవేసి చరుస్తాడా ?— మరి ఊళ్లో యీలాంటి నీచుల్ని ఉండనివ్వకూడదు. వాడికి మన తడాఖా చూపి తీరాలి'—అంటున్నారు మరికొంతమంది వ్యక్తులు ఉద్రేకం చూపిస్తూ. వారిని కమ్యూనిస్టుయోధులుగా మనం తలుద్దాం !

'ఎందుకంత ఖంగారుపడ్తారు. మంచీ చెడ్డా యోచింపకుండా-అలా అనటం మంచిది కాదు. ఫలానా...మన సోదరుడ్ని యెందుకు కొట్టవలసి వచ్చిందో యేమో ముందు మనం యోచించుదాం. అందరి తప్పొప్పుల్ని మనం నిర్ణయించుదాం ఆ నిర్ణయం జరిపిన పిదప, అందరి అభిప్రాయం తెల్సుకొని-హెచ్చు అభిప్రాయం ఏలా ఉంటే అలా ..నడుచుకొందాం- దేనికయినా - భగవంతుడు మనకు బుర్రలు పెట్టినందుకు కొంత దూరం యోచిస్తే...మనకే నిజం బోధపడుతుందిగా...నిజంగా తప్పే జరిగినట్లయితే- మనం మన శక్తి చూసి తీవ్రంగా పోరాడి...మన గౌరవం నిలబెట్టుకొందాం. ఇంతకీ అసలు వ్యక్తి యిక్కడ లేడు-ఆ వ్యక్తి వచ్చిన పిదప-అన్ని విషయాలూ మనం-మాట్లాడుకొందాం. కొంచెం సేపట్లో అతడూ వస్తాడు ఆ కాస్సేపు ఓపిక పడదాం. ఈ లోపుగా అనవసరపు మాటలు మాట్లాడి గౌరవం పాడుచేసుకోవటం మంచిది గాదు. గాంధీమహాత్ముడు ఎంత తక్కువగా మాట్లాడితే అంత మంచిదనీ- ఆరోగ్యం కలుగుతుందనీ చెప్పాడు. అందువల్ల సమయంవచ్చేవరకూ మాట్లాడకుండాఉండటం మేలు! అన్నారు కొందరు వ్యక్తులు- గాంధీగారి మౌనవ్రతాన్ని...తాము ఆచరణలో పెడుతున్నట్లుగా! వీరి వాదాన్ని సోషలిష్టువాదంక్రింద మనంజమకడ్దాం.

'మీ యిష్టప్రకారం నడవండి. మీరేవిధంగా నడచినా మా కభ్యంతరంలేదు, మీకు మా హృదయపూర్వకమైన కోపరేషన్ ఎప్పుడూ యిస్తాం. న్యాయంగా తోచినదానికి- మీశక్తి వంచన లేకుండా పోరాడండి. విజయంతప్పక లభిస్తుంది.' అన్నారు మరికొందరు గోడమీదపిల్లి వాటంగా! వారేపార్టీకి చెందినవారో నిర్ధారణచేయలేక పోయాంగనుక 'గోడమీదపిల్లివాటం' పార్టీతరఫువారు అని నామకరణంచేదాం.

ఈవిధంగా ఎవరికి తోచినవిధంగా వారు మాట్లాడుతున్నారు. నిజానిజాలు తెలియకుండానే వారి సంభాషణ జరిగిపోతూంది నదీప్రవాహంలా

ఏమయితేం ఒకగంట కాలానికి- కొంతమంది కొంత నిర్ణయానికి వచ్చారు. ఏమనంటే—తమ ఫలానాసోదర విద్యార్థిని, 'అదేదో మరితెలియదుగా!' తమవిద్యార్థులు-సమ్మెచేయ నిశ్చయించారు. తమసమ్మె విజయవంతంగా సాగవలెనంటే

విద్యార్థులందరి సహకారం కావాలి. ఈవిధంగా సహాయం చేయవల్సిందని వారిలో ఒకవ్యక్తి అన్నాడు.

తిరిగి చర్చలు జరిగాయి. ఓట్లతో బలాబలాలు నిర్ణయించుకొన్నారు. ఎంత తమ పార్టీలకుబలం చేకూర్చినా ఓట్లను బ్రతిమాలి, బ్రతిమాలి పుచ్చుకొని తమపార్టీకి బలంచేకూర్చ ప్రయత్నించారు. కొందరు పార్టీ అభిమానులు. ఒక్కపార్టీతప్ప, మిగిలిన వన్నీగూడా ఓడిపోయాయ్. హింసామార్గం మంచిదికాదని, గాంధీగారి అడుగుజాడల్లోనడచేపార్టీకే ఒకేఒక వోటుతో విజయం లభించింది. అయితే తమబలిమికీ, యితరులు తమకు సహకారం యివ్వటంవల్ల అందరి అంగీకారం పుచ్చుకొని తమఅభిప్రాయం ప్రకారం నడుద్దామని తీర్మానించుకొన్నారు విజయంపొందినపార్టీ వారు.

తిరిగిచర్చలు జరిగాయి ఒక అరగంటకాలం. ఏమయితేం- చివరిఅభిప్రాయం గాంధిగారి అడుగుజాడలో నడచే పార్టీదేగా. అయితే సోదర పార్టీలవారి అభిప్రాయాలకు తగిన సానుభూతి చూపుతూ, యీవిషయం చర్చించటం మంచిదని పార్టీబలానికి అది ప్రాణమని వారునిర్ణయించారు. అందువల్ల చర్చానంతరం- సమ్మెచేయటానికి, (అంటే అహింసామార్గంలోనుమా) తమకుజరిగినఅన్యాయాన్ని పైకితెలియజేయడానికీ, క్షమాపణపత్రం, తమముందుకువచ్చి పడినట్లయితే, సమ్మె విరమించుకొనడానికీ, లేనిచో కొనసాగించి, అవసరమైన పక్షంలో తమ తడాఖా చూపించటానికి (అవసరం అయితేసుమా!) నిర్ణయించుకొన్నారు.

సమ్మెచేయాలనే నిర్ణయం యేలాగూ జరిగిందిగా! సమ్మెకు కావలసిన సన్నాహాలు మరి ఉండొద్దూ!

పార్టీ పోటీల్లో బలాబలాలు నిర్ణయించుకొన్నప్పటికీ యీ విషయంలో యితర్ల విద్యార్థులంతా తగిన సహకారం యిచ్చారు. అంతాకలసి పని చేయ నిశ్చయించుకొన్నారు.

అందువల్లవెంటనే, సమ్మెచేయటానికి అవసర సన్నాహాలు ప్రారంభించారు. కొందరు విద్యార్థులతో అసలువిషయాలు చెప్పి రావటానికి బయలుదేరారు. మరికొందరు పోస్టర్లు వ్రాసి గోడలకంటించే సన్నాహాలుమీద బయలుదేరారు. మరికొందరు జండాలకోసం పరుగెత్తారు. ఎక్కడజనం అక్కడ యీవిధంగా పనిలో నిమగ్నులైయుంటున్న సమయంలో పదిగంటలయింది.

ఏవ్యక్తినిగూర్చి, పాఠశాల విద్యార్థులీ కార్యం చేయ నిశ్చయించుకున్నారో ఆవ్యక్తే తెల్లబోతూ వచ్చి విషయం యేమిటని ప్రశ్నించాడు.

'ఏమిటేమిటీ, మరి ఊరికుండేదికాదు. విజయం సాధించితీరుతాం. ఇవాళ నిన్న రేపు మనల్ని, మరి ఊరుకోగూడదు, అన్నారుకొంతమంది.

వచ్చిన వ్యక్తికి అంతా ఆశ్చర్యం కలిగింది. 'ఏమిట్రా విషయం నాకు తెలియదు, సరిగా వివరంచెప్పండి' అని ప్రశ్నించాడతను. 'ఆదేమిటోయ్ నిన్నపాయంకాలం అన్యాయంగా, అందులోనూ, ప్లేగ్రౌండులో ఆ హిస్టరీమేస్టరు, నిన్ను కొట్టలేదూ? అందుకోసం"

"నన్నా హిస్టరీమేస్టరా? ఎందుకూ?" అంటు ఆశ్చర్య పోయాడతను.

"ఎందుకేమిటి? నే చూడలేదూ? నిన్నుకొట్టాడాయన" అన్నాడొక విద్యార్థి, అసలు వ్యక్తికంటే తన కెక్కువ తెలిసినట్లుగా!

'ఓ అదా ..' అంటూ ఫక్కుననవ్వి జవాబిచ్చాడతను. 'ఓరి వెంగళాయిలూ. సమ్మె సన్నాహాలా! ఆ, ఏంలేదు. చరిత్రపేపరు- బాగావ్రాశావనీ, బాగామరీ చదవాలనీ, హుషారులో ఆయన వీపుచరిచారు అంతేగాని నన్ను బాదలేదే!" అన్నాడతను

'నువ్విప్పుడూ యింతే! నిన్ను మా పెద్దగా యెన్నుకోడం మాదేతప్పు' అన్నారు కొందరు సమ్మెముందిగ్గి